క్లుప్తంగా

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తుదారులను విచారిస్తున్న అనిల్‌రెడ్డి

యాచారం: 'గృహలక్ష్మి' దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల నుంచి 2,137 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను ఎంపీడీఓ విజయలక్ష్మి గ్రామాలవారీగా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. బుధవారం కార్యదర్శులు మండలం పరిధిలోని కుర్మిద్ద, నస్దిక్‌సింగారం, నందివనపర్తి తదితర గ్రామాల్లో దరఖాస్తుదారులను విచారించారు.

మండలం సాధించే వరకు దీక్షలు

వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి



దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు, వైస్ ఎంపీపీ, తదితరులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేసే వరకు దీక్షలు కొనసాగిస్తామని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గత 52 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం శ్రీనివాస్‌రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. మండల ఏర్పాటుకు కావాల్సిన వనరులు, సదుపాయాలు అన్ని ఉన్నా ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 10 గ్రామ పంచాయతీల మద్దతు ఉన్నా గుడిపల్లి గ్రామాన్ని మండలముగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఇటీవల జీఓ జారీ చేసిందన్నారు. గట్టుఇప్పలపల్లిని కూడా మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అనురాధ, కిషన్‌రెడ్డి

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించే అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. పూజారి శ్రీనివాసశర్మ నేతృత్వంలో సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డిలు భూమిపూజ చేశారు. దాతల సహకారంతో రూ.50 లక్షలతో అయ్యప్పదేవాలయం నిర్మిస్తున్నట్లు సర్పంచ్ అనురాధ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కాసుల వెంకటేశ్, వెంకటేశ్, శ్రీశైలం, శేఖర్, యాదయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు



పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

ఆమనగల్లు: పట్టణానికి చెందిన పలువురు బీజేపీ నాయకులను బుధవారం ఆమనగల్లు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు విఫలమయ్యారని, బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఆమనగల్లు పట్టణానికి చెందిన మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు నర్సింహ, వెంకటయ్యలను పోలీసులు ఉదయం అరెస్టు చేసి సాయంత్రానికి విడిచిపెట్టారు.

పరమేశ్‌కు సన్మానం



పరమేశ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: డాక్టరేట్ గ్రహీత, ఇబ్రహీంపట్నం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పి. పరమేశ్‌ను బుధవారం ఉపాధ్యాయులు సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరమేశ్‌ను ఉపాధ్యాయులు శాలువ కప్పి, మెమెంటోను అందజేసి సత్కారించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణాదేవి, దమయంతి, స్వర్ణలత, సుప్రియ, గిరిజ, శ్రీలత, జ్యోతిలు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో జాతీయ జెండాలతో విజయోత్సవ సంబురాలు



జాతీయ జెండాతో యువజన సంఘాల ఐక్యవేదిక నాయకులు

జయహో చంద్రయాన్

అంతరిక్ష చరిత్రలో ఇస్రో సరికొత్త చరిత్ర సృష్టించింది. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైంది. దీంతో బుధవారం సాయంత్రం సంబరాలు మిన్నంటాయి. టపాసులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. జాతీయ జెండాతో జయహో భారత్ అంటూ నినాదాలతో వీధులు మోరుమ్రోగాయి. ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పలు చోట్ల యువకులు ర్యాలీలు తీశారు.



కడ్తాల్: టపాసులు పేల్చుతున్న యువకులు



అబ్దుల్లాపూర్‌మెట్‌లో బీజేపీ నేతల సంబురాలు

కులవృత్తులకు అండగా బీఆర్‌ఎస్

ఎమ్మెల్యే మంచిరెడ్డి

తుర్కయంజాల్: వెస్ట్ హైదరాబాద్‌ను తలదన్నేలా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి చెందనుందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 19వ వార్డులో నూతనంగా నిర్మించిన విశ్వకర్మ భవన్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే, అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కులవృత్తుల వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎల్లప్పుడు ప్రజల అభివృద్ధిని కాంక్షించే బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. అనంతరం 100 మంది విశ్వ బ్రాహ్మణులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలను కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. బ్రాహ్మణపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి క్యాడర్‌ను ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, కౌన్సిలర్లు కవిత, శ్రీశైలం, బ్యాంకు డైరెక్టర్ స్వప్న శ్రీనివాస్, నాయకులు సంపతీశ్వర్‌రెడ్డి, విజయానందరెడ్డి పాల్గొన్నారు.



విశ్వకర్మ భవన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

నూతన నియామకం

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ నూతన అధ్యక్షుడిని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్‌లు బుధవారం ఎన్నుకున్నారు. మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని చల్లంపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అశోక్‌కు వారు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని, ప్రజా సమస్యలపై పోరాడుతానని, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ నరేందర్, నాయకులు ఇక్బాల్‌పాషా, తిరుపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, నర్సింహ, రమేశ్‌గౌడ్, రామకృష్ణ, నారాయణ, శ్రీకాంత్, శాబుద్దీన్, సత్యనారాయణ, శేఖర్, రాంరెడ్డి, కుమార్, మహేశ్, శివ తదితరులు ఉన్నారు.



కడ్తాల్: అశోక్‌కు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

పేదలపాలిట వరం సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: పేదలపాలిట సీఎంఆర్‌ఎఫ్ పథకం వరంగా మారిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన వెంకటేశ్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్సపొందాడు. సహాయనిధి పథకానికి గోలి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో దరఖాస్తు చేసుకోగా రూ.1 లక్ష మంజూరయ్యాయి. ఆమనగల్లు పట్టణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గోలి శ్రీనివాస్ రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును వెంకటేశ్‌కు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సుభాష్, నాయకులు శివకుమార్, కిరణ్, సుమన్, శేఖర్, రైసల్‌నాయక్, శ్రీరాములు పాల్గొన్నారు.

పోచమోని జంగయ్యకు నివాళి

ఇబ్రహీంపట్నం: బండలేమూరు మాజీ సర్పంచ్ కామ్రేడ్ పోచమోని జంగయ్య 26వ వర్ధంతిని సీపీఎం నేతలు బుధవారం నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలోని పాష నరహరి స్మారక కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. సామేల్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకి చేతబట్టి భూమి కోసం, భుక్తి కోసం పేద ప్రజల వెట్టి చాకిరి విముక్తి కోసం జంగయ్య పోరాటం చేసినట్లు తెలిపారు. అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన జంగయ్య 1997 ఆగస్టు 23న అనారోగ్యంతో మరణించాడని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎల్లేస్, వెంకటేశ్, శంకర్, మసలయ్య, యాదగిరి, బుగ్గరాములు, జగన్, నర్సింహా, శ్రీకాంత్, స్వప్నలు పాల్గొన్నారు.



జంగయ్యకు నివాళి అర్పిస్తున్న నేతలు

దశరథ్‌కు అభినందనలు



దశరథ్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న రేవంత్‌రెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కానుగుల దశరథ్‌కు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అభినందించారు. కర్నాటక రాష్ట్రం కట్టప్రభలో గత నెల 10 నుంచి 23వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన కాంగ్రెస్ సేవాదళ్ నాయకులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరానికి తెలంగాణ రాష్ట్రం నుంచి 30 మంది నాయకులు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం శిక్షణ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ సేవాదళ్ నాయకులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ శిబిరానికి హాజరైన తలకొండపల్లి మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కానుగుల దశరథంకు రేవంత్‌రెడ్డి ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య

యాచారం: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. డీఎస్సీ ద్వారా వెంటనే ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీచేయాలని వారు డిమాండ్ చేశారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసేది కేవలం టీఎస్‌యూటీఎఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జగన్నాథం, మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహా, అంజయ్య, ఉపాధ్యాయులు మల్లేశ్, మోతిలాల్, వెంకటేశ్, మహేశ్, రమేశ్, జగదీష్, జంగయ్య పాల్గొన్నారు.



గునుగల్ ఆదర్శ పాఠశాలల్లో సభ్యత్వ నమోదులో గాలయ్య తదితరులు

నవోదయకు దరఖాస్తు చేసుకోండి

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: నవోదయ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడానికి దరఖాస్తు చేసుకోవాలని పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ తెలిపారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 11 మందికి నవోదయ అప్లికేషన్ ఫారాలు పూర్తి చేసి ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పీఎస్, యూపీఎస్, హెచ్‌ఎంఎస్, టీచర్ల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులతో దరఖాస్తుకు ప్రోత్సహించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న స్వప్న తదితరులు

హయత్‌నగర్: ప్రజలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. బుధవారం 21వ వార్డులో రూ.63 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు, అంతర్గత డ్రైనేజీ నిర్మాణం పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో కాలనీలు వేగంగా విస్తరిస్తున్నాయని పెరుగుతున్న నివాసాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణా రెడ్డి, కౌన్సిలర్ గీత పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆమనగల్లు: పత్తిపంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో బుధవారం ఆమె రైతులు సాగుచేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ.. వరిలో కాండం తొలచు పురుగు నివారణకు పటేరా గుళికలను 4 కిలోల ఇసుకలో కలిపి చల్లాలని సూచించారు. పత్తిపంటలో పోషక లోపాల నివారణకు ఫార్ములా 4 ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు మల్లయ్య, జంగయ్య, పెద్ద మల్లయ్య హనుమంతు, పూల్య, రవీందర్ పాల్గొన్నారు.

మాడ్గులలో 'ప్రవాస్ అభియాన్'



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భరత్

ఆమనగల్లు: మాడ్గుల మండలంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవాస్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వచ్చిన కర్నాటక రాష్ట్రం మంగళూర్ నార్త్ ఎమ్మెల్యే డా.భరత్‌శెట్టి , మండలానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. పార్టీ విజయం కోసం కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కమలేశ్, వెంకటేశ్, వెంకట్‌రెడ్డి, శంకర్, వెంకటేశ్ గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం

ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీరామ్

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి టికెట్లపై ఉన్న శ్రద్ధ.. విద్యారంగ సమస్యల పరిష్కారంలో లేదని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు కె. శ్రీరామ్ ప్రశ్నించారు. ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం బుధవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..నాలుగేండ్లుగా విద్యారంగ సమస్యలు కొకొల్లలుగా ఉన్నప్పటికీ పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో చూపడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సంజీవరెడ్డి, జగదీశ్, సందీప్, శివ, గణేశ్, మహేందర్‌లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.10 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు నర్సింహ, వార్డు సభ్యులు నరేందర్, మల్లయ్య, భిక్షపతి, గణేశ్, ఎట్టమ్మ, నాయకులు యాదగిరిరెడ్డి, అశోక్, రాంచంద్రయ్య, రాంచందర్ నాయక్, మంకి శ్రీను, వెంకటయ్యగౌడ్, శ్రీను పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ..

కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మరోసారి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ప్రకటించడంతో మండలంలోని గౌడ, వీరశైవ, కురుమ, రజక, మహారాజు, ముదిరాజ్, నాయీబ్రాహ్మణ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 4వ వార్డు పరిధిలోని సాయినగర్‌కాలనీకి వెళ్లేదారిలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులకు వినతి పత్రం అందజేశారు. విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డుపై అధిక సంఖ్యలో వాహనాలు నిలుపుతున్నారని , దీంతో కాలనీలోకి వెళ్లేందుకు తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ రోడ్డుపై వాహనాలు నిలవకుండా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని కోరినట్లు వారు తెలిపారు. అలాగే, సర్వీస్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న పాన్‌షాపులు, హోటళ్ల తొలగించాలని వాటి వల్లే వాహనాలు నిలుపుతున్నారని, వీటి కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయంటూ స్థానిక వార్డు కౌన్సిలర్ వద్దేపల్లి విద్యావిజయేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు సుదర్శన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నాగేష్, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మహిపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.



పెద్దఅంబర్‌పేటలో సర్వీస్ రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

రాజ్యాధికారంతోనే ముదిరాజ్‌ల బతుకులు బాగు



ధ్రువపత్రాలు అందజేస్తున్న యాదగిరి, సంఘం నాయకులు

ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు యాదగిరి

తలకొండపల్లి: రాజ్యాధికారంతోనే ముదిరాజ్‌ల బతుకులు బాగుపడతాయని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. అందరు ఐక్యమత్యంతో రాజ్యాధికారం కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బుధవారం మండలంలోని దేవునిపడకల్‌లో ఆ సంఘం మండలాధ్యక్షుడు యాదగిరి సమక్షంలో గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ నూతన అధ్యక్షుడిగా రామస్వామి, గౌరవ అధ్యక్షుడిగా జంగయ్య, ఉపాధ్యక్షుడిగా రఘు, స్వామి, రామస్వామి, రాములు, యాదయ్య, జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా నరసింహ, కార్యదర్శులుగా మల్లేష్, మహేష్, శ్రీశైలం, సలహాదారులుగా ఆంజనేయులు, కార్యదర్శులుగా వెంకటేష్, కార్తీక్, శ్రీను, రాము, విక్రమ్, హరికృష్ణ, శ్రీను, శ్రీశైలంతో పాటు, మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... ముదిరాజ్‌ల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి వారి ప్రగతికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి, తదితర రంగాల్లో వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్‌ల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటేశ్

తలకొండపల్లి: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారంహైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆయన నివాసంలో ఎంపీపీ తిర్మణీ నిర్మలా శ్రీశైలంగౌడ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గానికి అధిక నిధులు మంజూరు చేసి బడుగు బలహీన, నిరుపేదలను ఆదుకోవాలని మంత్రికి విన్నవించారు. గృహలక్ష్మి పథకం కింద అధిక ఇళ్లను మంజూరు చేసి గూడులేని నిరుపేదలకు మేలు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి రాబోయే ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, గౌడసంఘం తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, తదితరులు ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, తదితరులు

పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర నాయకుడు మోహన్‌రెడ్డి

కడ్తాల్: మండలంలో వర్షాలు లేక జొన్న, మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని, వెంటనే ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చల్లంపల్లిలో కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఎండిపోయిన జొన్న, మొక్కజొన్న ,పత్తి పంటలను, కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటల సాగు చేస్తే, వర్షాలు లేక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని వాపోయారు. అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎండిపోయిన పంటల వివరాలను సేకరించి, పంటలు కోల్పోయిన రైతులకు పంట నష్టపరిహారం అందిచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ సర్పంచ్ నరేందర్, నాయకులు ఇక్బాల్‌పాషా, సురేందర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, శేఖర్, జంగయ్య, తిరుపతిరెడ్డి, రామకృష్ణ, శాబుద్దీన్, కుమార్, నర్సింహ, శ్రీకాంత్, నారాయణరెడ్డి, మహేశ్, శివకుమార్,రాములు ఉన్నారు.



చల్లంపల్లిలో ఎండిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి, తదితరులు